# ఇండోనేషియా ప్రతిఘటనా బాటలో విద్యార్థులు, కార్మికులు

**జకార్తాలోను,** ఇతర నగరాల్లోనూ పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కొంటూ విద్యార్థుల నిరసనలు కొనసాగాయి. సెప్టెంబరు మధ్యలో మొదలైన ఈ నిరసన వెల్లువ నెలాఖరుకల్లా తీవ్రమై రెండు దశాబ్దాల అతిపెద్ద విద్యార్థి ఉద్యమంగా నిలిచింది.

పార్లమెంటులో కొత్త క్రిమినల్ కోడ్ ప్రవేశ పెట్టటాన్ని, అవినీతి నిరోధకశాఖ అధికారాలను తగ్గించటాన్ని విద్యార్థులు వ్యతిరేకిస్తున్నారు. ఇతర సమస్యలపై కూడా వారు తమ నిరసన గళాన్ని వినిపించారు. సైనిక దురాగతాలకు నిలయంగా మారిన పపువా, పశ్చిమ పపువా రాష్ట్రాలలో సైనిక జోక్యాన్ని అంత మొందించాలని, నగరాలను విషవాయువులతో ముంచెత్తుతున్న, పెద్ద స్థాయిలో సాగుతున్న చెత్తను తగుల బెట్టడానికి ప్రభుత్వం స్వస్తి పలకాలని వారు డిమాండు చేశారు.

వివిధ కార్యకలాపాలను నేరపూరితంగా ప్రకటించే, పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేకతతో అనేక అప్రజాస్వామిక విధానాలను కలిగివున్న కొత్త క్రిమినల్ కోడ్‌పై ఓటింగ్‌ను దేశాధ్యక్షుడు జోకో విడోడో వాయిదా వేశాడు. అయినప్పటికీ విద్యార్థులు తమ నిరసనలను అక్టోబరు మొదటివారం వరకు కొనసాగించారు. ప్రస్తుత పార్లమెంటు ఆఖరి సమావేశాలు జరుగుతున్న పార్లమెంటు భవనాన్ని సెప్టెంబరు 30న వేలాది మంది విద్యార్థులు ముట్టడించారు. బారికేడ్లతో, సాయుధులైన భారీ పోలీసు బలగాలు వారిని అడ్డుకున్నాయి. బారికేడ్లను దాటుకుని వచ్చే క్రమంలో వందలాదిమంది విద్యార్థులు గాయపడ్డారు. అనేక వందలమందిని అరెస్టు చేశారు. సాయంత్రం వరకు ఈ ఘర్షణ కొనసాగింది. 210 మందికి గాయాలయ్యాయని, 519 మందిని అరెస్టుచేసి విచారిస్తున్నామని సంబంధిత అధికారులు తెలియజేశారు. ఎప్పటిలాగే ప్రభుత్వం పార్లమెంటు సమావేశాలను అడ్డుకోవటానికి కుట్రచేసిన హింసాత్మక వాదులుగా నిరసనకారులపై ముద్రవేసింది.

దేశాధ్యక్షుడు విడోడోతో జరిగిన చర్చలు విఫలం కావటంతో ఇండోనేషియా కార్మిక సంఘాల సమాఖ్య అక్టోబరు ఒకటి నుండి విధులను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. పార్లమెంటు వద్దకు 50వేల మంది కార్మికులను సమీకరిస్తామని, అన్ని దీవుల్లోనూ లక్షమందిని కదిలిస్తామని సమాఖ్య పేర్కొంది. వేతనాల్లో కోతలు విధిస్తూ, కార్మికులను తమ సాంఘిక, ప్రజాస్వామిక హక్కులకై పోరాడేట్లు చేస్తున్న పారిశ్రామిక చట్టాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల సమాఖ్య ఈ పిలుపునిచ్చింది.

అధ్యక్షుడు విడోడో అనేక వాణిజ్య అనుకూల విధానాలను ప్రవేశపెట్టాడు. అవినీతి నిరోధకశాఖను చట్టసవరణలతో నిర్వీర్యం చేయటం, నీటి సరఫరాను ప్రైవేటీకరించటం, భూమిపై సహజ వనరులపై అదుపును కలిగి వుండకుండా కార్పొరేట్ల పైనున్న ఆంక్షలను ఎత్తివేయడం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించటంకోసం పేదప్రజలను నిర్వాసితులను చేసే, పర్యావరణానికి హాని కలిగించే అనేక మౌలిక వసతుల ప్రాజెక్టులను చేపట్టటం వంటివి వీటిలో కొన్ని మాత్రమే. ఇవన్నీ గత ప్రభుత్వాలు అనుసరిస్తూ వస్తున్న, బడావాణిజ్య, సామ్రాజ్యవాద ద్రవ్యపెట్టుబడి నిర్దేశిత విధానాల్లో భాగమే.

ఇది అనేక సాంఘిక, ఆర్థిక అసమానతలకు, ప్రజల జీవన పరిస్థితుల, పని పరిస్థితుల ప్రమాణాలు అనేకరెట్లు తగ్గిపోవటానికి దారి తీసింది. దీని ఫలితంగా ఇండోనేషియా ప్రజలలో పెరిగిన అశాంతి, అసంతృప్తులే విద్యార్థుల నిరసనలు, కార్మికుల సమ్మె రూపంలో వ్యక్తమయ్యాయి.

ఇండోనేషియా పాలకవర్గాలు ప్రజాస్వామిక హక్కులను తిరస్కరిస్తూ, అణచివేత విధానాల నవలంబిస్తూ, మత దురభిమానాలను పెంచి పోషిస్తూ కుటిల యత్నాలకు పాల్పడుతున్నాయి. ఒక్కరినే వివాహం చేసుకోవాలనే మోనోగమీ పద్ధతికి, వివాహంపట్ల విశ్వాసాలకు, ఇంకా ఇతర మత సంబంధమైన విలువలకు ప్రాధాన్య మిస్తున్నట్లు కనబడటానికి కొత్త క్రిమినల్ కోడ్‌ను తీసుకువచ్చి సాంప్రదాయక ఇస్లాం శక్తులను సంతృప్తిపరచటానికి ప్రయత్నిస్తున్నాయి.

ఈ సంక్షోభం పాలకవర్గ గ్రూపుల మధ్య ఘర్షణలకు దారితీస్తోంది. వారిలో ఒక గ్రూపు దేశాధ్యక్షుడు విడోడోను దువ్వుతూ రాజ్యాంగబద్ధ సవరణల ప్రతిపాదనలు చేస్తుండగా, మరో గ్రూపు ఇండోనేషియా ప్రజల ప్రతిఘటనా చర్యలను కైవసం చేసుకోవలసిందిగా తమ ట్రేడ్ యూనియన్లను ప్రేరేపిస్తుంది. కానీ ఈ రెండు గ్రూపుల లక్ష్యం ఒకటే: దశాబ్దాలుగా ఇండోనేషియా రాజకీయాలను శాసిస్తున్న కుటుంబ పాలనను బలోపేతంచేయటం, ఇటీవలి కాలంలో తలెత్తిన సాంఘిక, రాజకీయ ప్రతిఘటనలను సమర్థవంతంగా తిప్పికొట్టటానికి మార్గాలను అన్వేషించటం.

ooo